క్లుప్తంగా

రాజకీయ ఉనికి కోసమే చౌకబారు ఆరోపణలు



మాట్లాడుతున్న సూర సమ్మయ్య

పాలకుర్తి: పెద్దపల్లి జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధుకర్ తన రాజకీయ ఉనికి కోసమే మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ఆయన సతీమణి దేవాదాయశాఖ కమిషనర్ శైలజా రామయ్యర్‌పై చౌకబారు ఆరోపణలు చేస్తున్నాడని డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య ఆరోపించారు. పాలకుర్తి మండలం కన్నాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధికి మారు పేరు మంత్రి శ్రీధర్‌బాబు అయితే.. హత్యా రాజకీయాలకు మారుపేరు పుట్ట మధుకర్ అని అన్నారు. మంత్రికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే పుట్ట మధుకర్ పసలేని ఆరోపణలు చేస్తున్నాడన్నారు. సమావేశంలో నాయకులు అరుకాల సతీశ్, శిలగాని రాజేశం, బాలగోని కుమార్‌గౌడ్, కొమిరె సురేశ్, సంపంగి కుమార్, సూర సంతోష్ పాల్గొన్నారు.

అక్రిడేషన్ కార్డులు జారీ చేయాలి

పెద్దపల్లిరూరల్: వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు జారీ చేయాలని టీయూడబ్ల్యూజే హెచ్–143 జిల్లా అధ్యక్షుడు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు కొట్టె సదానందం కోరారు. అక్రిడేషన్ కార్డుల గడువు ముగిసినందున కొత్త కార్డులు జారీ చేయాలన్నారు. కాగా స్థానిక ఎమ్మెల్యే విజయ రమణారావును కలిసి జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు. కోవిడ్ సమయంలో జర్నలిస్టులకు రద్దుచేసిన రైళ్లలో రాయితీపై ప్రయాణించే పథకాన్ని పునరుద్ధరించాలని విన్నవించారు. ఆర్టీసీ బస్సుల్లోనూ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ప్రయాణం కల్పించాలని, ఇళ్ల స్థలాలను కేటాయించాలని విన్నవించారు. ప్రైవేట్ స్కూళ్లలో చదివే జర్నలిస్టుల పిల్లలకు రాయితీ వర్తింపజేసేలా ఆదేశాలివ్వాలన్నారు.

భాషా పండితులకు పదోన్నతి కల్పించాలి

సుల్తానాబాద్: భాషా పండితులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పదోన్నతి కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా కోరారు. సుల్తానాబాద్‌లోని బాలికల హైస్కూల్‌లో శనివారం జిల్లా ఉపాధ్యాయ పండిత పరిషత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో లాంగ్వేజ్ భాషా పండితులందరినీ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా, ఎంఈవోలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. వి.తిరుపతి, రాష్ట్ర బాధ్యులు, జిల్లా బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ముగిసిన శిక్షణ తరగతులు



శిక్షణ అనంతరం ఉపాధ్యాయులు

జూలపల్లి: బోధనలో విద్యాప్రమాణాలు సాధించడమే కాకుండా, బోధనలో మెలకువలు నేర్పించడమే లక్ష్యంగా ఎలిగేడు, జూలపల్లి మండలాల ఉపాధ్యాయులకు ఎంఈవో సరస్వతి అధ్యక్షతన చేపట్టిన ఐదురోజుల శిక్షణ శనివారం ముగిసింది. జూలపల్లి, ఎలిగేడు మండలాల రిసోర్స్ పర్సన్లు రాజేందర్‌రెడ్డి, సంపత్‌కుమార్, భాస్కర్, యోగేందర్, రాజేశ్ కుమార్, త్రివేణి, సీఆర్‌పీలు తిరుమల, సతీశ్, సీసీవో మధు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఎస్సై, సింగిల్‌విండో చైర్మన్

పాలకుర్తి: మండల పరిధిలోని గ్రామాల్లో కన్నాల సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు వేగవంతం చేయాలని సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి ఆయా కేంద్రాల ఇంచార్జిలకు సూచించారు. మండల పరిధిలోని జీడీనగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం మండల వ్యవసాయాధికారి ప్రమోద్, బసంత్‌నగర్ ఎస్సై స్వామితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఇంకా దాదాపు 12లారీల ధాన్యం నిల్వలు ఉన్నట్లు అంచనా వేశారు. అన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ఈనెలాఖారులోగా పూర్తి చేయాలని, తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. కన్నాల సింగిల్‌విండో సీఈవో సదయ్య, కేంద్రాల నిర్వాహకులు వంశీ, సంజయ్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

వృథాగా తాగునీరు



పెద్దపల్లిరూరల్: ఇంటింటికీ తాగునీరు అందించేందుకు చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అవుతున్న నీరంతా వృథాగా పోతోంది. కుళాయిలకు ఆన్ ఆఫ్ చేసేందుకు అవకాశం లేకపోవడంతో ఇలా తాగునీరంతా మురుగు కాలువల్లోకి చేరుతోంది. ఈ దృశ్యం పెద్దపల్లి పట్టణంలోని సుభాష్ విగ్రహం వద్ద కనిపించింది.

హరితహారం చెట్లపై వేటు



జూలపల్లి: మండల కేంద్రం నుంచి భూపాలపట్నం వరకు ఐదేళ్ల క్రితం ఈజీఎస్ పథకంలో పెట్టిన హరితహారం చెట్లు వేటుకు గురవుతున్నాయి. రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లను అటు తమ పంటకు నీడ పడుతోందని రైతులు, లైను కింద ఉన్నాయని ఇటు విద్యుత్ సిబ్బంది కొట్టి వేస్తున్నారు. దీంతో రూ.లక్షలు వెచ్చించి పెట్టిన మొక్కలు కనపడకుండా పోతున్నాయి. ఇప్పటికైనా చెట్ల రక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే..



సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామ ప్రారంభంలోని రాజీవ్ రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావి ప్రమాదకరంగా మారింది. ఆదమరిస్తే అంతే సంగతి అనేవిధంగా ఉంది బావి. నిత్యం వందల వాహనాలు నడిచే రాజీవ్ రహదారిని ఆనుకొని ప్రమాదకరంగా బావి ఉండగా కానీ అక్కడ ఎలాంటి సూచిక బోర్డులు లేవని, రక్షణ చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

సింగరేణి వార్తలు

ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి



సన్మానిస్తున్న జీఎం నాగేశ్వరరావు

రామగిరి: సింగరేణి సంస్థలో ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరని ఆర్జీ–3, ఏపీఏ జీఎం కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న కార్పొరేట్ సివిల్ విభాగం జీఎం తిరుకోటి సూర్యనారాయణను శనివారం జీఎం కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సన్మానించారు. అంకితభావంతో ఆయన అందించిన సేవలు ఆదర్శమని, వారి శేష జీవితం సుఖ సంతోషాలతో గడపాలని జీఎం ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్లు వై.వి.శేఖర్‌బాబు, కె.యాదయ్య, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, సివిల్ ఏజీఎం పి.నాగేశ్వరరావు, ఏరియా సేఫ్టీ అధికారి ఎం.రామ్మోహన్, ప్రాజెక్టు అధికారి రాజశేఖర్, విభాగాధిపతులు రాజారెడ్డి, రాజేంద్రకుమార్, జనార్దన్‌రెడ్డి, పి.డి.సుధాకర్, చంద్రశేఖర్, రామరావు, గుర్రం శ్రీహరి, ఐలయ్య, ఆర్.రాజేశ్వరి పాల్గొన్నారు.

కార్పొరేట్ సివిల్ జీఎంకు సన్మానం



సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి కార్పొరేట్ సివిల్ జీఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందనున్న టి.సూర్యనారాయణను శనివారం ఘనంగా సన్మానించారు. ఆర్జీ–2 జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో అధికారులు నరసింహారావ్, పి.నరేశ్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న జనక్ ప్రసాద్

రామగిరి: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పర్సనల్ జీఎంను ఏర్పాటు చేయాలని రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆర్జీ–3 జీఎం కార్యాలయలో శనివారం ఆయన ఆపరేషన్ డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణిలో దాదాపుగా 25వేల మంది కార్మికులు ఉత్పత్తి, ఉత్పాదకత ఇతర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వారి సమస్యలు, సంక్షేమం కోసం ప్రత్యేక అధికారి లేకపోవడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల కోసం సింగరేణి సంస్థ స్థాయిలో ప్రత్యేక జీఎం(పర్సనల్)ను నియమించడంతో పాటు ప్రతీ ఏరియాలో ప్రత్యేక అధికారిని నియమిస్తే వారి సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయన్నారు. యాజమాన్యం ప్రత్యేక దృష్టి పెట్టి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నరసింహరెడ్డి, ధర్మపురి, సమ్మయ్య, కాంట్రాక్టు కార్మిక సంఘం ఆర్జీ–3 ఏరియా ఉపాధ్యక్షుడు ఉడుత శంకర్, నాయకులు సదానందం, భూమయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• కాపర్ వైర్ చోరీ

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని చిన్నకల్వల, కొదురుపాక గ్రామాల శివారులోని మూడు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్‌ను గుర్తుతెలియని దొంగలు శుక్రవారం రాత్రి ఎత్తుకెళ్లారు. సుల్తానాబాద్ ఏఈ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని దొంగలు చిన్నకల్వల ఎస్సారెస్పీ కెనాల్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని 25కిలోల కాపర్‌వైర్, కొదురుపాకలో రెండు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి 50కిలోల కాపర్‌వైరు ఎత్తుకెళ్లారు. దీని విలువ దాదాపు రూ.75వేలకు పైగా ఉంటుందని ఏఈ తెలిపారు. దీనిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు.

• పహల్గాం దాడిపై విచారణ చేపట్టాలి

రామగిరి: ఆపరేషన్ సింధూర్‌లో దాగి ఉన్న నిజాలను బహిర్గతం చేయాలని, పహల్గాం దాడిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమాక్రసీ జిల్లా నాయకులు ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమాక్రసీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు శనివారం మండలంలోని సెంటినరికాలనీలో నిరసన చేపట్టారు. నాయకులు లక్ష్మి, తారమ్మ, రాజమ్మ, పద్మ, రేణుక, ప్రవంతి, శంకరమ్మ, తిరుమల, రజిత పాల్గొన్నారు.

• బావిలో పడి వృద్ధురాలి మృతి

ఓదెల: మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపరపల్లెకు చెందిన గుంపుల కొమురమ్మ(77) అనే వృద్ధురాలు జీవితంపై విరక్తిచెంది శుక్రవారం రాత్రి వ్యవసాయబావిలో పడి మృతి చెందింది. ఎస్సై రమేశ్ కథనం ప్రకారం కొమురమ్మ కొంతకాలంగా పక్షవాతం, షుగర్‌తో బాధపడుతోంది. ఎన్ని మందులు వాడినా నయం కాలేదు. జీవితంపై విరక్తిచెంది ఇంటికి సమీపంలోని వ్యవసాయబావిలో పడి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమారుడు గుంపుల మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ.26.49 కోట్లతో ఆధునీకరిస్తున్నారు. కానీ అడుగడుగునా నాసిరకం పనులు దర్శనమిస్తున్నాయి. రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవానికి ముందే స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన 'రామగుండం' బోర్డు బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కూలింది. కాగా తొలివిడత పలు రైల్వేస్టేషన్లను ప్రధాని మోదీ వర్చువల్‌లో చేస్తున్న ప్రారంభోత్సవానికి ముందే ఇలాంటి నాసిరకం నిర్మాణాలు దర్శనమిస్తుండడంతో రైల్వే అధికార యంత్రాంగంపై స్థానికంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

జెన్‌కో సీఎండీకి శుభాకాంక్షలు



సీఎండీతో యూనియన్ ప్రతినిధులు

రామగుండం: రాష్ట్ర జెన్‌కో సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎస్.హరీశ్ (ఐఏఎస్)ను శనివారం స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ –1535 ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కేంద్రాల్లోని ఉద్యోగ సంబంధిత విషయాలపై సీఎండీతో చర్చించారు. కేంద్ర, రాష్ట్ర అధ్యక్షులు ఎంఏ.వజీర్, కల్లెం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ తఖీ (రామగుండం ఉద్యోగి) ఉన్నారు.

పీసీసీ అధ్యక్షుడు మహేశ్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భూషణవేన సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. జెండా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్.రాజయ్య, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ మస్రత్, సురేశ్ గౌడ్‌తో కలిసి కేక్ కట్ చేశారు. పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దొడ్డుపల్లి జగదీశ్, నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్‌గౌడ్, బూతగడ్డ సంపత్, బండారి సునీల్‌గౌడ్, ఫయాజ్, జయప్రకాశ్, రేగుంట సురేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న యూనియన్ నాయకులు, మేనేజర్ రామారావు

రామగిరి: ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2లో విధులు నిర్వహించిన దాయిక శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. కాగా శనివారం వారి కుటుంబ సభ్యులకు రూ.లక్ష విలువ గల చెక్కు అందజేశారు. సింగరేణి కార్మికుల నుంచి వసూలు చేసిన కంట్రిబ్యూషన్ చెక్కును గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామిండ్ల మనోహర్, వెంకటస్వామి, మేనేజర్ కె.వి.రామారావు శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు. సంక్షేమాధికారులు మురళి, ప్రీతి, జూనియర్ అసిస్టెంట్ ప్రణీత ఉన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి సర్వే

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మీర్జంపేటలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మానేరు తీరాన ఉన్న సమ్మక్క గద్దెల వరకు సీసీరోడ్డు నిర్మాణానికి శనివారం పీఆర్ ఏఈ జగదీశ్, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ రోడ్డు సర్వే చేశారు. యాత్రికుల సౌకర్యం కోసం సీసీరోడ్డు నిర్మించేందుకు ఎమ్మెల్యే విజయరమణారావు ఆదేశాల మేరకు రోడ్డు కొలతలు తీసుకుని ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపనున్నట్లు వారు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సదయ్య, నాయకులు సతీశ్, రాంచంద్ర, సదానందంగౌడ్ పాల్గొన్నారు.

'ఖని'లో ఘనంగా తిరంగా యాత్ర



తిరంగా యాత్రలో బీజేపీ నాయకులు

గోదావరిఖని: ఆపరేషన్ సిందూర్‌తో భారత సైన్యం చూపెట్టిన పరాక్రమాన్ని, ధైర్య సాహసాలను కీర్తిస్తూ శనివారం స్థానిక ప్రధాన వీధుల్లో తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన చౌరస్తా నుంచి నగర ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

'ట్రినిటి'లో ముగిసిన ఆన్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్



నియామక పత్రాలు అందుకున్న వారితో ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపకుడు మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: ట్రినిటి ఇంజినీరింగ్ కళాశాల ఆన్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ ముగిసింది. శనివారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, ట్రినిటి ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు నియామక పత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ప్రక్రియలో 10కిపైగా బహుళ జాతీయ కంపెనీలతో ఆన్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ చేపట్టామన్నారు. ఇందులో 212 మంది విద్యార్థులకుపైగా ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. బహుళ జాతీయ కంపెనీలు ఫాక్స్‌కాన్, ప్రీమియం ఎనర్జీస్, జెన్ టెక్నాలజీస్ టీం లీజ్, ప్రీమియర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, టాటా టెలి సర్వీసెస్, ఎంపవర్, బీట్స్ సాఫ్ట్ సొల్యూషన్స్, ముత్తూట్ ఫైనాన్స్, శ్రీరామ్ లైఫ్, సెంటిలైట్ ఇన్ఫర్మేషన్ తదితర కంపెనీలు పాల్గొన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ ఎం.గణేశ్, ఏవో సురేశ్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఆరిఫ్, ప్రవీణ్ కుమార్, హెచ్‌వోడీలు నటరాజన్, రాజిరెడ్డి, స్వాతి, ప్రభాకర్, పద్మిని, చొప్పరి వంశీ, చందు, రిక్రూట్‌మెంట్ రిప్రజెంటేటివ్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డం కుటుంబాన్ని కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: కాంగ్రెస్ నుంచి గడ్డం కుటుంబాన్ని వెంటనే సస్పెండ్ చేయాలని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమ్మయ్య, వైస్ ప్రెసిడెంట్ వడ్డేపల్లి దాస్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో నాలుగు దశాబ్దాలుగా రాజకీయ చక్రం తిప్పినట్లు చెప్పుకునే గడ్డం కుటుంబం, పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తూ కార్యకర్తల మధ్య విభేదాలు సృష్టిస్తోందని ఆరోపించారు. అజాత శత్రువుగా పేరున్న గొప్ప ప్రజానేత మంత్రి శ్రీధర్‌బాబుపై విమర్శలు చేయడం రాజకీయ పతనానికి నిదర్శనమన్నారు. పార్టీకి చిత్తశుద్ధితో పనిచేయాల్సిన ఎంపీ, ఎమ్మెల్యే పార్టీ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ క్రమశిక్షణ చర్యలు తీసుకొని పార్టీ నిబంధనలు ఉల్లంఘిస్తున్న గడ్డం కుటుంబాన్ని తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని వారు కోరారు. సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ సదానందం, నాయకులు శ్రీనివాస్, గడ్డం కృష్ణ, భూమయ్య, లగిశెట్టి ఆంజనేయులు, నయీం, వెంకటేశ్వర్లు, కంకణాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సరస్వతి పుష్కరాలకు ఉచిత బస్సులు



పుష్కరాలకు వెళ్తున్న జీడీనగర్ గ్రామస్తులు

పాలకుర్తి: మండలంలో మంథని నియోజకవర్గ పరిధిలో గల జీడీనగర్, కన్నాల, బామ్లానాయక్ తండా, రాణాపూర్ గ్రామాల సౌకర్యార్థం సరస్వతి పుష్కరాల కోసం మంథని ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత బస్సులను శనివారం డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు వెళ్లేలా మంత్రి తన సొంత ఖర్చులతో బస్సులు ఏర్పాటు చేశారని తెలిపారు.

రైల్వే వంతెన నిర్మాణాలు త్వరగా ప్రారంభించండి



సమస్యలు వివరిస్తున్న రైల్వే ప్రతినిధి

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న కుందనపల్లి, పెద్దంపేట రైల్వేగేట్లను ఎత్తివేసేందుకు సత్వరమే వంతెన నిర్మాణాలు చేపట్టాలని, రైల్వేస్టేషన్‌లో ఆధునీకరణ పనులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని రైల్వే ప్రజాసంబంధాల ప్రతినిధి అనుమాస శ్రీనివాస్ అన్నారు. సీనియర్ డివిజనల్ ఇంజినీర్ వామనమూర్తి, ఏడీఎన్ ఎం.కే.గుప్తా, ఐఓడబ్ల్యూ తదితర అధికారుల బృందం శనివారం రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న పనులను పర్యవేక్షించింది. ఈ సందర్భంగా డీఆర్‌యూసీసీ ప్రతినిధి పలు సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు ఇప్పటికే కుందనపల్లి రైల్వే వంతెన టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వంతెన నిర్మాణం చేపట్టేవారని, రాష్ట్ర ప్రభుత్వం నిధుల జాప్యంతో కేంద్ర నిధులతోనే చేపడుతున్నారని పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గేట్ల ఎత్తివేతపైనే ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. రెండో విడతలో రామగుండం రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు

పెద్దపల్లిరూరల్: నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి అబ్కారీ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని కుమ్మరికుంట గ్రామ పరిసరాల్లో శనివారం గుడుంబా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని 7 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామానికి చెందిన అభిలాష్, కమల్ పట్టుబడగా వారిపై అబ్కారీశాఖ చట్టం ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నాటుసారా అమ్మినా, తయారు చేసినా తమకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఎస్సై జీవన్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శరత్, సిబ్బంది శ్రీకాంత్, కృష్ణ, సంతోష్ ఉన్నారు.

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

మంథని: పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ మంత్రి శ్రీధర్‌బాబును లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేయడం సరికాదని ఎస్సీసెల్ మండల ఉపాధ్యక్షుడు ఆర్ల నారాయణ, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాదారపు నితీశ్ అన్నారు. మంథని మండలం ఎక్లాస్‌పూర్‌లో శనివారం వారు మాట్లాడారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న పెద్దపల్లి ఎంపీ అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలన్నారు. పార్టీ అంతర్గత విషయాలను బహిర్గతం చేస్తూ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయడం సరికాదన్నారు. ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి పేరవేన లింగయ్య, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, నాయకులు బొడ్డ శ్రీనివాస్, నల్ల రాజశేఖర్, మంథని శ్రీనివాస్, బూడిద రంజిత్ ఉన్నారు.